# ప్రేమ పూజారి

పేరు అనిల్. పాపం, ప్రోగ్రెస్ మాత్రం నిల్. వయసడిగితే ఇరవైకి ఒక అయిదు కలుపుకో అంటాడు. ముఖం సగం మాత్రమే కనిపించే హిప్పీ జుట్టు స్క్రీన్‌కి సగం వరకు తొలగించిన కర్టెన్‌లా వుంటుంది. మెలిదిరిగి మళ్లీ కిందకు దిగిన మీసాలు, ఎత్తు ఆరడుగులు గుమ్మానికి అరడుగు తక్కువగా ఉంటాడు. కండలు తిరిగిన శరీరం కాకపోయినా కుండలాంటి పొట్ట మాత్రం లేదు. ఎప్పుడూ లైట్ డ్రెస్‌లో బ్లాక్ బెల్టుతో టక్ చేసి కాలేజీ స్టూడెంటు వయసుతో, కాలేజీ లెక్చరరు స్టైలుతో కనిపిస్తాడు. నిజానికి అతను ఈ రెండూ కాదు. రెండు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న రెండోస్టేజీ క్లర్కు.

అనిల్ చాలా సంవత్సరాలుగా ఒకే ఒక కోరిక కలిగి వున్నాడు. ఎవరినయినా ప్రేమించాలి. ఆత్మీయుల్ని మాత్రమే సుమా! ప్రేమించిన వాళ్లనే పెళ్లి చేసుకుని, ఆ ప్రేమతోనే జీవించాలి అనేది. హైస్కూలు చదువు నుంచి కాలేజీ చదువు వరకు ప్రతిదీ ఫెయిల్యూరే. ఎన్నో ప్రేమలేఖలు ఎవరెవరికో వ్రాశాడు. కాని వాటిని పోస్టు చేయలేదు. ఇప్పటికీ సూట్‌కేసులో జాగ్రత్తగా వున్నాయి. కారణం నాలుగవ తరగతిలో చిన్న పేచీ వచ్చి పక్కింటి వసుధ ఇతని ముక్కుమీద గుద్దింది రక్తనాళాలు చిట్టి రక్తం కారేట్లు. అప్పటి నుంచి ఆడపిల్లలకు అటాక్ ఇవ్వాలంటేనే ఎక్కడలేని జ్వరం ముంచుకొస్తుంది.

అతను జీవితంలో ఎవరెస్టు శిఖరం ఎక్కాడు అంటే అది ఈ రోజే. ఆఫీసులో తనకు అసిస్టెంటుగా ఒక టైపిస్టుని వేశారు. ఆమె పేరు వసంత. కోతికి కొబ్బరికాయ చిక్కినట్లయింది అతని పరిస్థితి.

సెక్షన్ హెడ్ పరబ్రహ్మం అనిల్‌ను పిలిచి, "బాబూ! ఈ అమ్మాయి పేరు వసంత. నీ సీటులో వర్కు హెవీగా వుందని ఈమెను నీకు అసిస్టెంటుగా వేశాము. నీ పేపర్సన్నీ ఈమె చేత టైపు చేయించుకో" అంటూ పక్కనున్న పద్దెనిమిదేళ్ళ యువతిని పరిచయం చేశాడు.

అనిల్ తలెత్తి వసంతను చూశాడు. కళ్ల ముందు ఒక తెల్లని వెలుగు రేఖ ప్రకాశిస్తూ కనిపించింది., నోట మాట రాలేదు. ఎవరీ అందాల రాశి? ఎక్కడో చూసినట్లుంది! ఎక్కడబ్బా! అని తల కొట్టుకున్నాడు, తరువాత గుర్తొచ్చింది. తనకు రాత్రులు కలల్లో కనిపించే డ్రీమ్ గర్ల్ హేమమాలిని ప్రతి రూపమే ఈ వసంత.

అక్కడ హెడ్‌క్లర్క్ పరబ్రహ్మం వున్న సంగతి పది నిమిషాలకు గాని గుర్తు రాలేదు. గుర్తొచ్చి వెళ్ళి నెమ్మదిగా తన సీట్లో కూర్చున్నాడు. వసంత వెనకనే వచ్చి 'నమస్తే సార్' అంది తియ్యగా. జనవరి నెలలో ఎ.సి. రూములో కూర్చున్నంత ఇదిగా. జిల్ అయిపోయాడు. గొంతు తడారిపోగా, వణుకుతున్న చేత్తో ఎదురుగా వున్న కుర్చీ చూపించాడు.

అనిల్ ఒక గంట గడిచిన తరువాత గాని మామూలు మనిషి కాలేకపోయాడు. ఆ అమ్మాయే చొరవ తీసుకుని ఎన్నో విషయాలు మాట్లాడింది. తనకు ఉద్యోగం చేయడం ఇష్టం లేదని, పరిస్థితుల వలన తను తప్పకుండా చేయవలసి వచ్చిందని, వర్కు తనకు కొత్త అని, తనపై కఠినంగా ప్రవర్తించవద్దని కోరింది. దానితో అతనికి ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. ఏదో అనవసరమైన ప్రశ్నలు వేసి, అర్థంకాని జవాబులు పొంది, మనసు వికలమై, నిలకడలేని ఆలోచనలతో జారుడు బండమీద జారుతున్నట్లుంది అతని పరిస్థితి.

• • •      • • •      • • •

"భలే మంచి రోజు... పసందైన రోజు....." కూనిరాగాలు తీస్తూ ఆఫీసు కొస్తున్న అనిల్ గుమ్మంలోంచి వస్తున్న ఆఫీసర్ ఎదురయ్యే సరికి బల్లిలా, చెక్కిన శిల్పంలా గోడకు అతుక్కుపోయాడు. ఆయన్ని అలా పోనిచ్చి మిగతా చరణాలు పాడుకొంటూ లోపలికి వచ్చాడు.

ఆఫీసులో వాళ్లంతా అతన్ని ఆశ్చర్యంగా చూశారు. ఎప్పుడూ టైముకు అరగంట ముందే వచ్చేవాడు. ఈ రోజు గంట లేటు. అటెండెన్సు రిజిష్టరు ఆఫీసరుకు పోయుంటుంది, ఏం రిమార్కులు వ్రాశాడో తను టాయిలెట్ చేసుకోవడం ఆలస్యమయింది అనుకున్నాడు.

" గుడ్ మార్నింగ్ సార్!... కంగారు పడకండి. మీరు ఏదో పనుండి ఈ రోజు లేటుగా వస్తానని నాతో చెప్పినట్లు ఆఫీసరు గారికి చెప్పాను" అంది వసంత అనిల్ ఆలోచన్ని భగ్నం చేస్తూ.

అనిల్ కళ్ళలోంచి వెలుగు రేఖలు విరజిమ్మాయి. బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి. ఆ బుగ్గల ఎరుపు చూసి వసంత బుగ్గలు ఇంకా ఎర్ర మందారాల్లా విరబూసి తల వంచుకొనేట్లు చేశాయి. అనిల్ ఇలా తన్మయత్వంలో పడిపోవడానికి కారణం ఆ అమ్మాయి తనకు సహాయం చేసిందని కాదు. నిన్నటి కంటే వేయిరెట్లు అందంగా తయారయి వచ్చింది ఈ రోజు.

ఆ బంగారు బుగ్గలు, నవ్వినప్పుడు కింద పెదవులను చిన్నగా కొరికే తెల్లని పలువరుస, ఆవాలు చూపులు, మధ్య మధ్య జడ ముందుకు వేసుకుని చూసుకోవడం కన్నార్పకుండా చూస్తున్న అనిల్‌కి ఇదంతా తనను కవ్వించడానికి చేస్తుందా, యధాలాపంగా చేస్తుందా అనేది అర్థం కాలేదు. ఆమె మాటల్లో కనిపించే కొంటెదనం, వినిపించే రాగాలు ఎంతో హాయిగా వుంటాయి అనుకున్నాడు.

"మీరు చేసి సహాయానికి థాంక్సండీ!" ఎలాగో గొంతు పెగుల్చుకొని అన్నాడు.

"దానికేముంది సార్! రేపు నాకేదయినా అవసరమయితే మీరు చెయ్యరేమిటి" అంది ప్రశ్నార్థకంగా. సందేహం తీర్చండన్నట్లు సన్నగా గీచిన కాటుక రెప్పల్ని మెల్లగా ఆడిస్తూ అతని కళ్లల్లోకి చూసింది. తమ ఇద్దరి కళ్లను కలుపుతూ సిమెంటు రోడ్డు ఉన్నట్లు,

ఆ రెండు చూపులూ ఆ రోడ్డు మధ్యలో ఒక దాన్నొకటి కౌగిలించుకున్నట్లు భ్రమ కలిగింది అనిల్‌కు.

"ష్యూర్" అన్నాడుచివరకు.

ఆ రోజు తన ఇంట్లో వున్న ఫైల్సు గురించి వివరంగా చెప్పాడు వసంతకు. మోస్ట్ అర్జెంటు, అర్జంటు, ఆర్డినరీ ఫైల్సును విడివిడిగా పెట్టి చూపించాడు. పై నుంచి వచ్చే పేపర్లకు ఎలా రిప్లైస్ ఇవ్వాలి? వాటి గురించి కూడా చెప్పాడు. ఇంతలో ఒంటి గంట అయింది.

"ఇక భోజనం చేయండి" అంటూ పైకి లేచాడు.

"లేద్సార్ భోజనం చేసే వచ్చాను.మీరు వెళ్ళిరండి!" అంది. ఆమె ముఖంలో అలసట కొట్టవచ్చినట్లు కనిపించింది.

"నేనూ ఈ రోజు భోజనం తెచ్చుకోలేదు. మీ రలా వస్తానంటే కాంటీన్‌లో కాఫీ త్రాగి వద్దాం" అన్నాడు.

"అలాగే, పదండి" అంటూ మినీబాగ్ భుజాన తగిలించుకుని అతని వెనుకనే బయలు దేరింది.

అనిల్ మనసు పరిపరి విధాలుగా పోతోంది. 'ఈ అమ్మాయిని ఒక్క రోజులోనే ఎంత గాఢంగా ప్రేమించాడు తను. ఈ అమ్మాయితోనే జీవితాన్ని పంచుకోవాలి, లేదంటే వివాహమే మానుకోవాలి.

"రెండు బ్రూ." ఆర్డరిచ్చాడు.

తననే పరిశీలనగా చూస్తున్న వసంతను ప్రశ్నించాడు. "నేనంటే మీ కేం కోపం లేదు గదండీ?"

"అయ్యో! కోపమా! మీరు నాబాస్. పెత్తనమంతా మీదే. మీరేం చేసినా చెల్లుతుంది."

అనిల్ గుండెలో ఎవరో ఎక్కు పెట్టి వదిలిన మల్లెల బాణం ఘాటుగా దిగింది. 'ఓ మైగాడ్ ! భార్యమీద భర్త కుండే అధికారాలన్నీ తనకే ఇచ్చింది. ఇదే నిజమైతే'

"మరయితే నే నేమన్నా మీ రేమనుకోరు కదా!"

'లేదు' అన్నట్లు తలూపింది.

కొద్ది సేపు ఆలోచించి అన్నాడు: "మీరు చాలా అందంగా వుంటారండి."

"అంతేనా!" చిరునవ్వు నవ్వి వూరుకుంది కాఫీ గ్లాసు కింద పెడుతూ.

"అంతేకాదు, మీరు దివి నుండి భువికి దిగివచ్చిన అప్సరస. చంద్రుడు, నక్షత్రాలు మీ కాంతి వలననే ప్రకాశిస్తున్నాయి. మీ అందం, మీ గ్లామర్ హైలీ సూపర్బ్! నా కలల్లో కనిపించే హేమామాలిని మీరే!" నాలుక కరుచుకున్నాడు అనిల్ చివరి మాటకు.

"ఆపండి, సార్, మీ పొగడ్తలు! మరీ నేనంత అందంగా వున్నానేంటి, మీ మాటలు కాని!" ఓరగా చూసింది.

"ఏమయినా ఈ అందం ఎవరికో ఒకరికి ఎప్పటికైనా చెందాల్సిందే గదా, సార్!" ఉడికిస్తూ అంది.

'ఎవరికో ఏమిటి ఖర్మ! నాకే చెందుతావు. ఇంకెవరైనా ఈ మాటంటే పది మంది ముందు పబ్లిక్‌గా పళ్ళు రాలగొట్టిందును' లోలోపలే పళ్లు కొరుక్కున్నాడు. తను అసలు విషయంలోకి దిగాలనుకున్నాడు.

"ఇక వెళదాం సార్! చాలా టైమయినట్లుంది."

"వసంతగారూ! మీరు లైఫ్‌లో ఎవరినైనా ప్రేమించారా! లేక మీకోసం మీ బావగారెవరైనా ఎదురు చూస్తున్నారా! మీరు పెళ్ళి చేసుకోకుండా వుండడానికి ఇంకేదైనా కారణముందా"

వసంత ముఖంలో అంచలంచెలుగా రంగులు మారాయి. మేలిమి బంగారాన్ని కొలిమిలోంచి తీసి నట్లుగా ఎర్రగా తయారయింది. కళ్ళలోంచి నీళ్ళు కనురెప్పల్ని నిండుకున్నాయి. "టప్, టప్" మంటూ ఒకదాని వెంట ఒకటి కన్నీటిబొట్లు బుగ్గలకు జారాయి. "ప్లీజ్ స్టాప్ ది మాటర్!" విసురుగా అని వడివడిగా వెళ్ళిపోయింది వసంత.

అనిల్ అంత వరకు కుర్చీకి జారగిలబడి వున్న వాడల్లా నిటారుగా కూర్చున్నాడు. 'ఎంతపని జరిగింది' తను ఒక భగ్నహృదయిని ప్రేమించాడు. ఆమె ఒక భగ్న ప్రేమికురాలు. ఎవరిని ప్రేమించి ఎలా మోసపోయిందో? ఛీ! పెళ్ళిమాట ఎత్తేసరికి వెళ్ళిపోయింది.' అనిల్ మరొక కాఫీకి ఆర్డర్ ఇచ్చాడు, తల దిమ్ము తగ్గుతుందని. అయినా ఆ అమ్మాయి ఎవరో తనెందుకు బాధ పడాలి?

అనిల్ వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. వసంత ముఖంలో ఆ కోపపు ఛాయలు ఇంకా తగ్గలేదు. అనిల్ తలెత్తి చూసేసరికి తన వైపు సూటిగా చూస్తోంది. అనిల్ ఆ చూపుల్ని తట్టుకోలేక తల దించుకుని ఫైల్సు వ్రాయడంలో మునిగి పోయాడు సీరియస్‌గా.

సాయంత్రం నాలుగయింది. అందరూ కాఫీలకు, టిఫిన్‌లకు వెళుతున్నారు. "ఏమండీ కాఫీకి వెళదామా!" ముని వేళ్ళతో ఎవరూ చూడకుండా అతని చేతిమీద టైపు చేసింది.

"నాకేదో విసుగ్గా వుంది. మీరు వెళ్లండి,"

"ఆ విసుగు పోతుంది, రండి సార్! ప్లీజ్." అంటూ చనువుగా అతను వ్రాస్తున్న ఫైలు అందుకుని మూసి టేబుల్ మీద పెట్టింది.

"అది కాదండి."

"ఏది కాదండి! నాతో రండి. నేను మీ విసుగు పోగొడతాను" అంటూ బయలదేరతీసింది. మవునంగా ఆమెను అనుసరించాడు.

"రెండు సెవన్ లింక్స్..." ఆర్డ రిచ్చింది.

"సార్, మీకు కోపమొచ్చినట్లుంది, నా మ్యారేజీ విషయం ఎత్తేసరికి. నా కేవో గత జ్ఞాపకాలు వచ్చి నన్ను నేను కంట్రోలు చేసుకోలేక పోయాను."

'అవును, గ్రంధసాంగురాలివి కదా!' మనసులోనే తిట్టుకున్నాడు. ఇటువంటి వాళ్లకే తిట్టడం, దగ్గరకు తీయడం రెండూ తెలిసి వుంటాయి అనుకున్నాడు.

"సార్! ఒకసారిలాగే నేను ఇంటర్మీడియట్ చదివేటప్పుడు సురేష్ అని ఒక అబ్బాయి నాకు లవ్ లెటర్ వ్రాశాడు సార్! నా తీయని ముద్దుకోసం అతనొక జీవితకాలాన్ని వేస్టు చేస్తాడట. సురేష్ అందగాడు, డబ్బున్నవాడు, ఎంత బాగా వ్రాశాడు? నవ్వుతూ దగ్గరికి పిలిచాను. నా పరిచయం కోసం తపిస్తున్నాడు కాబోలు ఆనందంగా స్నేహితుల్ని వదిలి నా దగ్గరికి వచ్చాడు... అప్పుడు... సార్! సార్! ఏమిటి అలా వెళ్ళిపోతున్నారు? డ్రింక్ త్రాగండి సార్." వసంత పిలుపు లేవీ అతని చెవి కెక్కలేదు, వడివడిగా తన సీటులోకి వెళ్ళి గంట పర్మిషను వ్రాసి ఇంటికి బయలుదేరాడు.

టేబిల్ మీద సెవన్ లింక్స్ బాటిల్స్ రెండూ ఆమెను వెక్కిరించాయి. దూరంగా ఆఫీసు రూమ్‌లోంచి అనిల్ వడివడిగా వెళ్లిపోవడం కనిపించింది. పర్సులోంచి పది రూపాయల నోటు తీసి సర్వరు చేతిలో పడేసి బయటకు నడిచింది. ఆమె తెల్లని ముఖాన్ని నల్లని మబ్బులు ముసురుకుని కాంతివిహీనం చేశాయి. ఆమె కళ్ళలో ఏదో తెలియని అశాంతి, ఆవేదన చోటు చేసుకున్నాయి.

'డామిట్! ఈమె ప్రేమ కథలు వినడానికి కాబోలు తను ఉండేది. ఎంత పచ్చిగా చెబుతుంది తన అనుభవాలు. ఆ సురేష్‌గాడు పెళ్ళి చేసుకుంటానని చివరకు మోసం చేశాడు కాబోలు. ఛీ. ఛీ పరువు పోయిన తరువాత ఇలా ఉద్యోగంలో చేరి ఉంటుంది.' రాత్రంతా ఆలోచనలతో, అశాంతితో పొర్లాడాడు. అందుకే ఈ రోజు డ్రీమ్‌గర్ల్ హేమమాలిని కలలోకి రాలేదు.

• • •  • • •  • • •

"హోల్లో! గుడ్‌మార్నింగ్ సార్!" విష్ చేసి తన సీట్లో కూర్చుంది వసంత. అప్పుడే విరిసిన గులాబీలా ఉంది. మంచు బిందువులతో శుభ్రపడి స్వచ్ఛంగా మెరిసే గడ్డిపూవులా ఉంది. వైట్ డ్రెస్‌లో తెల్లని పావురంలా వుంది. ఆమెను చూడకుండా ఉండాలంటే అసాధ్యమయింది అనిల్‌కు. నిన్నటి తాలూకు భావాలు ప్రస్తుతం ఆమెలో ఏమీ లేవు.

"సార్! ఏదయినా పని చెప్పండి, చేస్తాను" అంది తనవైపు ఉన్న టైపు రైటరును టకటక లాడిస్తూ. టేబిల్‌కు ఈవల వైపు కూర్చున్న అనిల్ ఒకసారి తలపైకెత్తి మరలా దించుకున్నాడు. 'అవును తనకు ఆమె మీద కోపం దేనికి? తను పెళ్ళి గురించి అడిగితేనే గదా తన ప్రియుడు సురేష్ సంగతి చెప్పింది. తను సీరియస్‌గా ఉంటే ఆమెకు లోకువైపోతాను' అనుకున్నాడు. 'ఆడవాళ్ల సైకాలజీయే అంత, వాళ్ల ఆలోచనలన్నీ నెగిటివ్‌లో ఉంటాయి. తను మామూలుగా ఉంటే సరిపోతుంది'.

కొన్ని నిమిషాలు మౌనంగా గడిచాయి. "సార్! తమ కాళ్ళను బుద్ధిగా ఉండమని చెప్పండి." పెదవి కొరుకుతూ తనకే వినబడేట్లు కొంటెగా అంది.

ఎదురుగా ఉన్న అనిల్ ఆమె తెల్లని పాదాలు తన కాళ్ల కింద నలుగుతున్నాయని తెలుసుకుని "సారీ!" అంటూ చటుక్కున లాక్కున్నాడు.

"ఈ లెటర్సు టైపు చేయండి." బొత్తిగా పెట్టిన లెటర్సు అందించాడు. "అలాగే" అంటూ విసురుగా లాక్కుంది. కొద్ది సేపట్లో టైపుచేసి అతని ముందు పెట్టింది.

"మీ వాలుజడ చేసిన పనికి సంజాయిషీ చెప్పుకోండి ముందు."

"ఏమండీ మీరు చెప్పేది?"

"అవునండీ! మీరు పేపర్సు తీసుకున్న విసురుకు మీ వాలుజడ మీ మెడను చుట్టి నా గూబ గుయ్యిమనిపించింది." సీరియస్‌గా అన్నాడు.

వసంత ఏమీ మాట్లాడలేదు. కొన్ని నిమిషాలు గడిచాయి. "అలా క్యాంటీన్ వైపు వెళదాం, సార్." అప్యాయంగా అడిగింది. అనిల్ మవునంగా వున్నాడు.

"రండిసార్ అందరూ మనల్నే చూస్తున్నారు. మనమేదో మాట్లాడకూడని విషయం మాట్లాడుకుంటున్నట్లు..." రహస్యంగా అన్నట్లు అంది.

ఇక విధిలేక లేచాడు. ఇద్దరూ కాంటీన్‌లో కూర్చున్నారు. అనిల్‌కు ఏం మాట్లాడాలో తెలియలేదు.

"నే నంటే మీకెలాంటి అభిప్రాయముంది, సార్!" అడిగింది వసంత. మవునంగా వూరుకున్నాడు. మళ్ళీ మళ్లీ రెట్టించింది. చివరకు మెల్లగా అన్నాడు.

"మీరు ఒక భగ్న ప్రేమికురాలుగా నాకో విధమైన జాలి వుంది!".

"వాట్? నేనో భగ్న ప్రేమికురాలినా! నామీద జాలా! నా గత చరిత్ర ఏదో తెలిసినట్లు మాట్లాడుతున్నారే" అంది ఆశ్చర్యంగా.

"ఇందులో వింతేముంది? మీరు చెప్పారుగా ఆ సురేష్ గాణ్ణి మీరు...."

"నేనా వాణ్ణా! డబ్బు, అందం వుంటే సరిపోతుందా సార్! ఆ ఉత్తరం వచ్చిన రోజే వాణ్ణి మంచిగా దగ్గరకు పిలిచి చెప్పుతో కొట్టాను." ఆమె చేయి సన్నగా వణికింది. ఆమె అంతరాల్లో దాగివున్న అవమానం తాలూకు భావాలు ఒక్కసారిగా పెల్లుబికాయి.

"ఎక్స్‌క్యూజ్‌మీ !" మెల్లగా అని తల వంచుకున్నాడు.

ఇద్దరూ కాఫీ త్రాగారు. "సార్, మీకు దెబ్బ చాలాగట్టిగా తగిలిందనుకుంటాను. దీన్ని మీరే శిక్షించండి" అంటూ జడ గుండెల మీదుగా టేబుల్ మీద పడేటట్లు ముందుకు వేసుకుంది.

"నేను కాలుతొక్కి పొరపాటు చేశానుగదండీ." బుద్ధిగా అన్నాడు.

"నామీద మీ అభిప్రాయ ఏమిటో చెప్పనే లేదు."

"మీరంటే నాకు చాలా ఇష్టం, వసంత గారూ"

"మన ఇష్టా ఇష్టాలతో పనేముందండీ? మా తల్లిదండ్రులు ఒప్పుకోవాలిగా?" తలదించుకొని సిగ్గులతమొగ్గలవుతూ అంది.

"మీరేమయినా చెప్పండి! మీ రూపం నా హృదయంలో నిలిచిపోయింది" ధైర్యంగా అనగలిగాడు అనిల్.

• • •          • • •          • • •

రోజుల్ని నెలలు మింగిస్తే, నెలల్ని సంవత్సరాలు మింగేస్తున్నాయి. అనిల్, వసంత చాలా చేరువయ్యారు. ఆఫీసు వర్కు యథావిధిగా జరిగిపోతూ ఉంది. కానీ వీళ్ల సంభాషణే మిగతా క్లర్కులకు బాధాకరంగా వుంది. ఇంత అందమైన అమ్మాయి తమకు అసిస్టెంటుగా పడలేదే అని నాగేశ్వరావు, ఈశ్వరదాసు, రజాక్, విక్టర్ తెగ పీక్కుని చస్తున్నారు. వాళ్ళ పనే సాగడం లేదు. ఏదైనా కావాలని అడిగినా చాలా ముభావంగా జవాబు చెబుతుంది.

అనిల్ రెండు రోజుల లీవు తర్వాత ఆ రోజే ఆఫీసుకు వస్తున్నాడు. ఎల్లోకలర్ పాంటు మీద, రోజ్ కలర్‌పూల షర్టు టక్ చేశాడు. బ్లాక్ చారల టై కట్టాడు. నల్లబూటు, సెంటు వాసనలు పరిమళిస్తూ ఉండగా అప్పుడే ప్లేన్ దిగిన హీరోలా పలకరించిన వారిని పలకరించని వారిని నవ్వుతూ విష్ చేస్తూ ఆఫీస్ రూమ్‌లోకి వచ్చాడు.

వసంత ఆఫీసరుతో ఏదో మాట్లాడుతూ ఉంది. ఇతను వచ్చిన కొద్ది నిముషాల్లో వసంత వచ్చి తన సీట్లో కూర్చుంది. "హలో గుడ్‌మార్నింగ్, అనిల్ కుమార్ గారూ! ఎప్పుడువచ్చారు?" తీయగా అడిగింది. ఈ రెండు సంవత్సరాల్లో జరిగిన మార్పుల్లో అనిల్ బలవంతం మీద వసంత అతన్ని 'సార్' నుంచి, 'అనిల్ కుమార్‌గారూ' అనేంతవరకు వచ్చింది.

అనిల్ నవ్వి వూరుకున్నాడు.

"మీ పెళ్ళి చూపులు ఎలా జరిగాయి? మీ ఉడ్‌బి మిసెస్ గారు ఎలా ఉన్నారు? నా కంటే ఎన్నో వందల రెట్లు బాగుంటుంది కదూ!"

"ఛ... నేను పెళ్ళి చూపులకు సెలవు పెట్టానని ఎవరు చెప్పారు వసంతా... చెప్పాగా పర్సనల్ మేటరని."

"ఈ వయసులో పర్సనల్ మేటరు అదేగదా సార్!" నవ్వింది. ఆమె నవ్వుకు పరవశించి గతంలోకి వెళ్ళిపోయాడు.

మూడు రోజుల క్రితం సంగతి......

అనిల్ స్వతహాగా ప్రేమ విషయంలో అంత నేరుగా తెలియజేసే ధైర్యం లేదు కాబట్టి ఆ రోజు రాత్రి తెల్లవార్లు మేలుకొని వసంత కొక లవ్ లెటర్ తయారు చేశాడు. తను చేసుకుంటే వసంతనే చేసుకోవాలనే భీష్మ ప్రతిజ్ఞ. ఇక్కడ ప్రతిజ్ఞయొక్క మోడ్ వేరు.

"మై డియర్ స్వీట్ వసూ!

నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. కోయిల వసంతకాలం కోసం ఎలా ఎదురుచూస్తుందో అలాగే నా జీవితంలో వసంతం కురిపిస్తావని నీ రాక కోసం నా హృదయ మందిరం తెరిచి ఉంచాను.

హిమాలయాల్లో మానససరోవరం. మానస సరోవరం ఒడ్డున మన కుటీరం. అందులో మన కాపురం. ఆ మంచు కొండల్లో పరుగులు, ఆ సుదీర్ఘ జలపాతాల క్రింద మన కంబైన్డ్ స్నానాలు, ఓహ్... ఎన్నని చెప్పను! అలా కలలు కనని రోజు నేను నిద్రపోలేదంటే నమ్ము.

నీవు మీ తల్లిదండ్రులతో మాట్లాడి మన పెళ్ళి సెటిల్ చెయ్. నా మాటే మా తల్లి తండ్రులకు వేదవాక్కు.

అన్ని విషయాలకు వెంటనే జవాబు తెలియజేస్తావుగా! ప్లీజ్!!

ఇక ఆపేస్తా...

నీ ప్రేమకోసం పరితపించే నీ ప్రేమ పూజారి,...

– అనిల్?"

అలా ఆమెకు వ్రాసిన లెటరు ధైర్యంగా ఆమెకు అందజేయలేక ఒక ఫైల్లో వుంచి, "వసంతగారూ! ఈ నాలుగు ఫైళ్ళు రేపు టైపుచేసి పెట్టండి. చాలా జాగ్రత్తగా చదివి చేయాలి సుమా! మోస్ట్ ఇంపార్టెంట్" అన్నాడు.

"అలాగే, అనిల్ గారూ! తమరి లీవుకు కారణం అడక్కూడదనుకుంటాను."

"ఎగ్జాక్ట్లీ వచ్చిన తర్వాత తప్పకుండా చెబుతాను" అంటూ అప్పటికి తప్పించుకున్నాడు.

గతంలోంచి తెప్పరిల్లి అడిగాడు "ఆ నాలుగు లెటర్లు టైపు చేశారా?".

"ఆ మరురోజే చేసి సంతకాలకు పంపాను సార్" అంది ఎంతో సిన్సియర్‌గా.

"ఫైల్సన్నీ చదివేగా టైపు చేసింది?"

"మీరు మరీ అమాయకులండీ! చదవకుండా టైపు ఎలా చేస్తానండీ?" మెల్లగా నవ్వింది.

అనిల్ ఆనందం అంతా ఇంతా కాదు. పెళ్లయి పోయినట్లు, ఇద్దరూ కాశ్మీర్‌కు హనీమూన్ పోయినట్లు కలలు కనసాగాడు.

"ఇంతకీ మీ నిర్ణయం చెప్పరేమిటి?" అన్నాడు.

"మీరు అమ్మాయిని చూస్తే నేనా నిర్ణయం చెప్పేది? నన్నేమయినా పెళ్ళిచూపులకు ఆహ్వానించారేమిటి చెప్పడానికి ?" నిష్ఠూరంగా అంది తల త్రిప్పుతూ.

అనిల్ తల పట్టుకొన్నాడు. 'ఇంత అమాయకంగా మాట్లాడుతుందేమిటి? తన లవ్ లెటర్ మీద ఏం నిర్ణయం తీసుకుందో చెప్పదేం? అసలింతకూ ఉత్తరం చదివినట్లా లేదా చించి కిటికీలో నుంచి పారేసిందా!'

"ఫైల్సన్నీ బాగా చదివా నంటున్నావు గదా! ఆర్.ఎస్.ఏడొందల ఒకటి నంబరు ఫైల్లో గ్రీన్ కలర్ లెటర్ చూశారా?"

"అవును ఎందుకు చూడలేదు? చూశాను."

"దాన్ని చదవ లేదా"

"అవన్నీ ఎందుకు చదువుతాము సార్? టైప్ చేయబోయే పేపర్లు చదువుతాము. అది ఎంక్లోజర్ గదా అని టైప్ లెటరుకు దాన్ని కుట్టి పెద్ద ఆఫీసరు సంతాకాలకు మేడ మీదకు పంపాను. ఏం ఆమాత్రం నమ్మకం లేదా?"

అనిల్ నెత్తిన ఎన్నో వందల టన్నుల స్కైలాబ్ పడ్డట్లయింది. భూమి రెండుగా చీలి అందులో పడినట్లు, ఆకాశం అయస్కాంతంలా తనని పైకిలాగినట్లు, సముద్రం తన ఉత్తుంగ తరంగాలతో అట్టడుగుకు లాగినట్టు ఫీలయ్యాడు.

'ఇంకేముందీ! ఆ లెటరు ఆయన చూశాడంటే!' ఏం చేయడానికి తోచలేదు. ఆ స్థానంలో ఆవేశం ముంచుకొచ్చింది.

"ఏం మనుషులండి మీరు? .... నాకుచెప్పి కదూ మీరు ఫైలు సంతకాలకు పంపాల్సింది? కామన్ సెన్స్ లేదు... చ...చ సరియైన టైపిస్టునే వెతికి వేశారు నాకు... బుద్ధి తక్కువై నీకీ పని చెప్పాను." రెండు చేతులతో తల పట్టుకుని కూర్చున్నాడు.

"ఎవరికండీ కామన్ సెన్సు లేంది?... అర్జెంటు అని ఉంటే అర్జెంటు కాబోలని పంపాను. మిగతా ఫైళ్ళ గురించి నేనేమైనా పట్టించుకొన్నానా! బుద్దిలేంది మీ క్కాదండీ, నాకు బుద్దొచ్చేట్లు చేశారు..... ఇన్నాళ్ళు నన్నర్థం చేసుకుంది ఇంత మాత్రమేనన్న మాట.... జీవితంలో గుర్తుండేటట్లు నాలుగుమాటలడిగారు...." నిశ్శబ్దంగా ఏడుస్తూ కళ్ళు తుడుచు కుంటూంది వసంత. ఎక్కిళ్ళు నిమిషాల్ని లెక్కిస్తున్నాయి. ఇన్నాళ్ళ తమ స్నేహం ఒక్క క్షణంలో తెగిపోయినందుకు ఆమెకెంతో బాధగా ఉంది.

వీళ్ల తగాదాను వింతగా చూస్తున్న ఖాశిం 'ఇది వీళ్ళకు మామూలే! రేప్పొద్దున ప్రాణమిత్రుల్లా, జంటకవుల్లా, చెట్టుకు, కాయకు ఉన్న సంబంధంలా అయిపోతారు' అనుకొని మరలా ఫైల్లోకి తలదూర్చాడు,

ఆ రోజు ఇద్దరిలో ఎవరూ ఆఫీసు పని సరిగా చేయలేదు. 'తప్పక ఆఫీసర్ ఫైలు చదువుతాడు. అందులో తన లవ్‌లెటర్ అతని కంటపడుతుంది. తనను ఉద్యోగం నుండి సస్పెండు చేస్తాడు. ఇక మానససరోవరం స్థానంలో సహారా ఎడారి, జలపాతాల స్థానంలో నిప్పుల వర్షం కురుస్తుంది. వసంత ఎంత పని చేసింది? ఒక విధంగా తప్పు తనదేనేమో' అనుకున్నాడు.

'అవును. ఎప్పుడూలేంది తనతో అంత కఠినంగా ఎందుకు మాట్లాడు? ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా తీర్చుకోవచ్చు కదా. ఏదో ఇంట్లో స్వంత భార్యను దబాయించినట్లు ఆఫీసులో అందరి ముందు పరువు తీశాడు. ఇందులో తన తప్పేమయినా ఉందా? అతను చెప్పినట్లు తను చేసింది.' ఆలోచిస్తూంది వసంత.

అనిల్ ఆలోచనలను ఆపి, ప్రస్తుత పరిస్థితుల్ని గురించి ఆలోచించసాగాడు. టైప్ చేసిన తరువాత పేపర్లు సెక్షన్ హెడ్‌కు, అక్కడ నించి ఆఫీసరు సంతకాలకు పోతాయి. తరవాత క్యాంపుక్లర్కు వచ్చిన ఫైళ్ళని సరిచూసి స్టెనోకి డిస్పాచ్‌కి పంపుతాడు. డిస్పాచ్ అయిన తరువాత ఫైళ్లను ఏ సెక్షనుకు సంబంధించిన వాటిని ఆ సెక్షనుకు పంపుతాడు స్టెనో.

అనిల్ వెంటనే సెక్షన్ హెడ్‌ను చేరుకున్నాడు. "నమస్తే.సార్!" విష్ చేశాడు. టేబిల్ మీద తలపెట్టి హాయిగా నిద్రపోతున్న సెక్షన్ హెడ్ పరబ్రహ్మం కూర్చోమన్నట్లు నిద్రపోతూనే చేయి చూపాడు. "ఫామిలీ ప్లానింగులో ఉన్న లాభాలు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయోయ్! ఉన్న డజను మంది పిల్లలతో సతమతమై చస్తున్నానుకో. తృప్తిగా నిద్రపోవడానికి కూడా అవకాశం లేదు. అసలు నా సలహా అడిగితే రేపే వెళ్ళి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకో" అన్నాడు.

"నాకింకా పెళ్లే కాలేదు, సార్."

"అవున్రోయ్. నా మాట విని చేయించుకోకు. ఈ విషయం తెలిస్తే ఎవరూ పిల్ల నివ్వరు." పెద్దగా నవ్వాడు తన జోకుకు తనే. ఆజోకు పుణ్యమా అని నిద్రలోంచి లేచాడు. విషయం అడిగి తెలుసుకున్నాడు.

"ఆఫైలు టైపు కాగానే కంపేర్ చేసి ఆఫీసరుకు పంపాను, ఇంకెక్కడుంటుంది అది. ఈ పాటికి ఎప్పుడో హైదరాబాద్‌కు డిస్పాచ్ అయ్యుంటుంది" అన్నాడు. అనిల్ దుఖా:న్ని దిగమింగుకుని చుట్టూ చూశాడు. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు. తననే అప్పటి వరకూ కళ్ళింతలు చేసుకుని చూస్తున్న వసంత చప్పున తల వంచుకుని పనిలో మునిగిపోయింది. 'రాక్షసి' పళ్ళు కొరుకున్నాడు.

నేరుగా ఆఫీసరు రూము ముందు నిలుచున్నాడు. "ఒరేయ్ రాఘవులూ! ఈ రూపాయి తీసుకుని టీ త్రాగు!" అంటూ రూపాయినోటు బయటకు తీశాడు. ఆఫీసరు రూము ముందు కూర్చుని కునికిపాట్లు పడుతున్న రాఘవులు చప్పున జేబులోకి ఎక్కించాడు.

"ఒరేయ్! ఆఫీసరుగారి దగ్గర నా సీటు ఫైల్సు ఏమయినా ఉన్నాయిట్రా?"

"లేవు, స్వామీ!'

అనిల్ హతాశుడయ్యాడు. జనరల్‌గా ఆఫీసరు దగ్గర 'డిలే' ఉంటుంది. ప్రస్తుతం ఆ అవకాశం కూడా లేకుండ పోయింది. 'ఇప్పుడేం చేయాలి? ఆ లెటరు చూసుంటాడా? చూసి తన మీద యాక్షన్ తీసుకోమని చెప్పాడమో!'

ఆలోచిస్తూ మెట్లెక్కుతున్న అనిల్‌కు ఎదురుగా వస్తున్న క్లర్కు పరదేశిని డాష్ కొట్టాడు. తరవాత "ఎక్స్‌క్యూజ్ మీ, రో!" అంటూ రెండు చేతులు పట్టుకున్నాడు. పరదేశి అనిల్‌ని ఆప్యాయంగా కౌగిలించుకొని, "ఏరా ఇలా చిక్కిపోయావు? ముఖం చూస్తే వోమెన్ ముఖంలా వుందే. ఏం జరిగింది? నీ బట్టర్‌ఫ్లైవసంత నీతో ఏదైనా తగాదా పెట్టుకుందేమిటి?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

మేడమీదికి తీసుకెళ్ళి ఒక వారగా నిలబెట్టి తనలోని బడాబాగ్ని అంతా బయటపెట్టి కొంత బరువు దించుకున్నట్లు ఫీలయ్యాడు అనిల్. "ఒరేయ్! జరిగిందేదో జరిగింది, నీ పక్కనే నేనుంటాను. నీ అదృష్టం బాగుంటే కాగితాలు ఇంకా ఆఫీసరు చూసి ఉండడు."

ఇద్దరూ కాంపుక్లర్కును చేరుకున్నారు. తమకు కావలసిన ఫైలు సంతకాలయి వచ్చిందా అని అడిగాడు. "తొందర దేనికయ్యా? నిదానంగా వస్తుంది, వెళ్లండి" అన్నాడు విసుగ్గా.

"అసలు విషయం అదికాదు, సార్! జరిగిందిది" అంటూ విడమర్చి చెప్పాడు పరదేశి, అనిల్ వారిస్తున్నా వినకుండా.

"అద్గదీ! నాకు లవ్ విషయాలు వినాలంటే చాలా ఇష్టమోయ్" అంటూ రిజిష్టరు అలా అలా తిరగేసి, "అయ్యో, మీ ఫైల్సు సంతకాలు అయి తిరిగి వచ్చాయి. స్టెనో దగ్గరకు డిస్పాచ్‌కి వెళ్ళాయి" అన్నాడు.

మారు మాట్లాడకుండా ఇద్దరూ స్టెనో రూము చేరుకున్నారు. స్టెనో రెండు రోజులు లీవు. లీవు లెటరు పేపరు వెయిట్ క్రింద గాలికి రెపరెప లాడుతూ దర్శనమిచ్చింది.

• • •       • • •       • • •

అనిల్ తన ఆరోగ్యం బాగాలేదని నాలుగు రోజులు లీవ్ పడేశాడు. స్టెనో అడ్రెసు తెలియక టౌన్‌లో ఎవరిచ్చిన అడ్రసూ పట్టుకొని అణువణువూ వెతికి చివరకు రెండో రోజు సాయంత్రం ఒక బార్‌ముందు గర్ల్ ఫ్రెండ్‌తో మాట్లాడుతూ ఉంటే పట్టుకొన్నాడు.

అంతా విని, "వోరి నీ పాపం కూలా! ఈ రోజు నేను లీవు కాన్సిలు చేసుకుని ఆఫీసు కెళ్ళానయ్యా. నీ కాగితాలన్నీ వచ్చి ఉన్నాయి. అన్నీ డిస్పాచ్ చేశాను రిజిష్టరు పోస్టులో, ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు అరరె.... నేనొక ప్రేమికుల జంటను విడదీశానే... అయ్యాయ్యో! ఎంత పని జరిగింది?" వాపోయాడు స్టెనో.

ఒక్క క్షణం అచేతనంగా నిలబడిపోయిన అనిల్ ఏదో స్ఫురించినట్లు ఎక్కుపెట్టిన బాణంలా హెడ్ పోస్టాఫీసుకు పరుగెత్తాడు. కాగితాలు హైదరాబాద్ స్పెషల్ ఆఫీసరుకు వెళ్తాయి. ఇక్కడ చూడ్డం మిస్ అయితే అక్కడ ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేడు. తన ఉద్యోగం నమ్మకంగా పోతుంది.

అనిల్ అరగంటపైగా వెయిట్ చేసి పోస్టు మాస్టరు ఇంటర్వ్యూ సంపాదించాడు. దాచుకోకుండా అంతా చెప్పాడు. పోస్టు మాస్టరు ఉగ్రుడయ్యాడు.

"నీలాంటి వాళ్ళవల్లనే సంఘంలో ఆడపిల్లలు బ్రతకలేకున్నారు. పోలీసు రిపోర్టిచ్చి నీ అంతు తేలుస్తాను. మా పెద్దామ్మాయిని నీలాంటి వాడెవడో అణన్నర వెధవ లేపుకు పోయాడు. నిన్ను వదలడానికి వీల్లేదు" అంటూ చడామడా తిట్టాడు.

బావిలో నుంచి వచ్చి చెరువులో పడ్డట్టయింది అనిల్ పరిస్థితి. ఇక ఎప్పుడూ ఆడపిల్లల జోలికి పోనని, ఈ పొరబాటుకు క్షమించమని, అతని పెద్ద కూతురును లేపుకు పోయిన వాడి అడ్రసు కనుక్కోవడంలో సాయం చేస్తానని చెప్పాడు.

చివరి మాటకు ఆయనేదో సంతోషించినట్లు కనపడి రిజిస్ట్రేషన్ క్లర్కును పిలిచాడు. పోస్టు మాస్టరిచ్చిన పర్టిక్యులర్సును పుస్కరించుకొని వెళ్ళిన రిజిస్ట్రేషన్ క్లర్కు కొద్ది సేపట్లో

తిరిగి వచ్చాడు. "సార్! అది సాయంత్రం మూడు పది క్లియరెన్సులో వెళ్ళిపోయింది" అన్నాడు.

"బాబూ! అంతా అయిపోయింది. జరగవలసినదేదో దేముడే నిర్ణయించాడు. ప్రపంచానికి నీవల్లనైనా కొంత గుణపాఠం వస్తుంది." ఫక్కున నవ్వాడు పోస్టుమాస్టరు కళ్ళెగరేస్తూ.

'చ... జాలి తలపకపోతే మానె! ఎగతాళి చేయడం దేనికి?' ఇంకిపోయిన కళ్లలోంచి ఎంత ప్రయత్నించినా నీరు రావడం లేదు. దుఃఖం దిగమింగుకుని వెనకకు బయలు దేరాడు.

ఆ రాత్రంతా నిద్రలేదు. ఉదయం లేస్తూనే మరలా స్టెనోని కలుసుకొన్నాడు. ఇతన్ని చూడగాన్నే జరిగిందేదో ఊహించుకున్నాడు. "అరె భాయ్! చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం బుద్ధి మంతుల లక్షణం కాదు! ఆ తెలివి ముందే ఉండాలి" అంటూ పరోక్షంగాను, ప్రత్యక్షంగాను తిట్టి తరువాత ఎవరికో ఫోన్‌చేసి పది నిమిషాలు మాట్లాడాడు.

తరువాత అనిల్ వైపు తిరిగి, "అయ్యా, రేపు క్లర్కు హైదరాబాదు పోతున్నాడు. అతను అక్కడే ఉండి తపాలా రాగానే గుమస్తాకు చెప్పి నీ లవ్ లెటర్ ముందే ఆఫీసు పేపర్సు లోంచి విడతీస్తాడులే. భయపడకు' అంటూ తల వంచుకుని పనిలో నిమగ్నమయ్యాడు.

కళ్ళలోకి నీళ్లు ఉబికి మసకలు కాగా అక్కడి నుంచి తిరుగుముఖం పట్టాడు.

• • • • • • • • •

అనిల్ అదృష్టం ఇక్కడా బాగోలేదు. వారం వరకూ అతృతగా ఎదురుచూస్తున్న అనిల్‌కు చావు కబురు చల్లగా చెప్పాడు హైదరాబాదు నుంచి వచ్చినాయన. ఆరోజు స్పెషల్ ఆఫీసరు తనే పర్సనల్‌గా ఫోన్‌చేసి వోపెన్ చేయాలని తపాలా తెప్పించుకుని చూశాడట. దాంతో ఇంకెలాగూ పని కాలేదు గదా అని ఆయన తిరిగి వచ్చేశాడట. రెండు రోజులు గడిచాయి. హైదరాబాదు స్పెషల్ ఆఫీసరు దగ్గర నుంచి టెలిగ్రాం వచ్చింది. 'ఆడపిల్లలకు లవ్ లెటర్సు వ్రాసి ఆఫీసు ప్రెస్టేజి చెడగొట్టి నందుకుగాను డిసిప్లినరీ ఏక్షను కింద అనిల్ కుమార్‌ను ఆరేళ్లపాటు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు. ఆ టెలిగ్రాం కాపీ అనీల్ కుమార్‌కు కమ్యూనికేట్ చేస్తూ ఆ రోజు నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్డర్సు కూడా ఇచ్చేశాడు ఆఫీసరు.

అనిల్ ఉద్యోగం వూడిందన్న సంగతి ఇంట్లోను, వూరంతా వ్యాపించింది. అనిల్ ఇంట్లో తిట్లు భరించలేక, విధిలేక పూర్వపు తన ఆఫీసు కాంపౌండ్ కాంటీన్‌లో సర్వర్‌గా చేరాడు.

చేరిన మొదటి రోజే వసంత తన ఆఫీసు స్టాఫ్ అందరినీ తీసుకొచ్చింది. "సర్వర్, నాలుగు బ్రూ కాఫీ! అర్జెంట్" వెటకారంగా అంది. చేతివేళ్ళు సుతారంగా టేబిల్ మీద ఆడిస్తూ తన ఫ్రెండ్‌తో కబుర్లు చెబుతోంది. అనిల్‌కు ఒళ్లుమండుకొచ్చింది. కాఫీ కప్పులు తెచ్చి ఆమె ముందు పెట్టాడు. చెవిలోంచి పెన్సిలు తీసి, మాసిపోయిన ఖద్దరు ప్యాంటు జేబులోంచి కాగితం తీసి బిల్లు వేశాడు.

"ఇదేమిటి? కాఫీనా! కషాయమా! బ్రూ కాఫీ తేవయ్యా అంటే బుద్ధిలేని కాఫీ తెచ్చావు" అంటూ అందరూ చూస్తుండగానే అతని ముఖం మీద పోసింది.

మేనేజరు ఏదో పొరపాటు జరిగిందని సర్దబోయాడు. అనిల్ ఒళ్లంతా లావాతో ఉడికే అగ్నిపర్వతం అయింది. "ఛీ!.... నీకా నాకా బుద్ధిలేంది? నీ కోతిచేష్టలు వల్లనేకదా నేను ఉద్యోగం పోగొట్టుకుని ఈ పరిస్థితికి వచ్చింది. నీవొక బుద్ధిలేని దానివి." పెద్దగా తిట్టడం మొదలు పెట్టాడు.

"ఎవర్నండి బుద్ధిలేని వాళ్లని తిడుతున్నారు?" అంటూ లోపలికి ప్రవేశించింది వసంత. అంత వరకు హాల్లో అతని తల్లితో, తమ్ముడితో మాట్లాడుతున్నదల్లా అతని గదిలోకి వచ్చింది.

కలలోంచి తెప్పరిల్లి వసంత ఇంటికి రావడం ఒక అబ్బురంగా భావించిన అనిల్ అంతలోనే తన ప్రస్తుత పరిస్థితి గుర్తుకు వచ్చి దుప్పటి ముసుగుతన్ని అటు తిరిగిపడుకున్నాడు.

వసంత ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ అంది "ఏమిటోనండి, ఎన్నిసార్లు అడిగినా మీ మనసులోని మాట చెప్పరు. అఫ్టాల్ చెప్పకుండా ఫైలు ఆఫీసరుకు పంపినందుకు అన్ని తిట్టారు. అయినా నే నేం మనసులో పెట్టుకోలేదు. ఈ రోజయినా ఆఫీసులో జాయినవుతారు గదూ......"

కొద్దిసేపు జవాబుకోసం ఎదురుచూసి అంది వసంత, "ఇట్సాల్ రైట్! మీ నిర్ణయం ప్రశాంతంగా తీసుకోండి. మీ కోసం ప్రత్యేకంగా స్పెషల్ స్వీటు తెచ్చాను. టేబుల్ మీద పెడుతున్నాను తీసుకోండి..." అంటూ అతని జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయింది.

'తనకు రోజుకొక పాడుకల వస్తోంది ఉద్యోగం వూడినట్లు, నాలుగు రోజులనగా హైదరాబాదుకు పోయిన వ్యక్తి ఇప్పటికీ అంతులేదు' ఆలోచనల్లోంచి తెప్పరిల్లి ఇటు తిరిగి టేబుల్ మీదున్న చిన్నపాకెట్ చేతిలోకి తీసుకున్నాడు. తెరుద్దామా, వద్దా అని క్షణం ఆలోచించాడు, 'స్పెషల్ స్వీటు అని అంది. కొంపదీసి ఇందులో ఏ నాటుబాంబో లేక పాయిజన్‌తో చేసిన హాటో లేదు కదా' అని అనుమానించి ఏమయితే అయిందని వోపెన్

చేశాడు. అందులో ఇతనూహించిన వేమీ లేవుగాని, ఓ అందమైన చిన్న రాధకృష్ణుల బొమ్మ. దానిమీద మడిచిన ఉత్తరం ఒకటి ఆహ్వానించాయి. వూపిరి బిగపట్టి చదివాడు. అతనిలో ఆనందం వెర్రిగంతులేసింది. పదిసార్లు ముద్దు పెట్టుకొన్నాడు. అందులో.....

"డియర్ అనిల్ కుమార్ గారూ,

ప్రతి మనిషికి ఒక మనసుంటుంది. ఆ మనసుకు కొన్ని భావాలుంటాయండీ. ఆ భావాలకు మనం చేయూతనివ్వాలి కాని, వాటితో ఆటలాడుకోకూడదు. నేనీ ఉద్యోగంలో చేరిన రోజు మిమ్మల్ని చూసి 'షాక్' తిన్నాను. మీరు నన్ను 'ఎక్కడ చూశానా' అన్నట్లు మీమాంసలో పడ్డారు. మనం ఒకర్నొకరు చూసుకొంది ఒక పవిత్ర స్థలంలో పెద్దల ముందండీ! అంటే ఇప్పుడర్థమయి వుంటుంది. మనం ఒకర్నొకరు చూసుకుంది పెళ్ళి చూపుల్లోనని. అందరూ ఒకరికొకరికి నచ్చామనుకొన్నారు. కట్నాల దగ్గర మీరు అసంతృప్తిగా వున్నారని అప్పుడే అర్థమయింది. వారం రోజుల తర్వాత మీ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. 'మీ అమ్మాయి అక్కర్లేదు, వేరే సంబంధం చూసుకుంటున్నాము' అని.

హు... ఈ సమాజంలో మనుషుల్ని కొనడం సహజమైపోయింది. మమత, మానవత్వం కనుచూపు మేరలో కనిపించడం లేదు. హృదయ వైశాల్యం కూడా లేకుండా పోయాయి. అలా ఎన్నో పెళ్లి చూపులకు అలంకరించుకుని షో కేసులో బొమ్మలా వున్నాను. తరువాత కొంత కాలానికి మా ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. మా నాన్న రిటైర్ అయ్యాడు. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ దాదాపు యాభై వేల వరకు వచ్చింది. దాంతో నాకేదయినా సంబంధం చూసి చేస్తా నన్నాడు. నేను ససేమిరా ఒప్పుకోలేదు. ఉద్యోగం చేసి నాకు నచ్చినవాణ్ణి చేసుకొంటానని వాళ్ళని బలవంతాన ఒప్పించి, ఆ మొత్తాన్ని ఫిక్సెడ్ చేయించి, చివరకు ఈ ఉద్యోగంలో చేరాను.

మిమ్మల్ని చూడగానే మీరు ఫలానా అని గుర్తించగలిగాను. మీ ప్రవర్తన చూస్తే మీకింకా పెళ్ళికాలేదని తెలిసిపోయింది. మరురోజు మీకంటే ముందుగా వచ్చిన నేను, మీకోసం స్కూలు నుంచి వచ్చిన మీ తమ్ముడు నన్ను చప్పున గుర్తుపట్టి ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు 'వదినా' అంటూ. మీరు జిల్లాల వారిగా ఆంధ్రా అంతా అమ్మాయిల కోసం వేటాడారని, కట్నాల దగ్గర ఎక్కడా కుదర్లేదని తెలిసింది. మిమ్మల్నొకసారి పట్టి చూడాలని నాటకం ఆడాను.

మీరు మంచివారే కాని, మీకు ధైర్యం లేదు. ఉంటే ఏనాడో మీ తల్లిదండ్రుల్నెదిరించి ఎవర్నో ఒకర్ని చేసుకుని ఉండేవారు. ఆ రోజు ఫైలు టైపు చేసేటప్పుడు మీ లవ్‌లెటర్

చదివాను. పదిలంగా దాన్ని నాగుండెలో దాచుకొన్నాను. మిమ్మల్ని నే నెంతగానో ప్రేమిస్తున్నాను.

మీ విషయం ఇప్పుడు తేలాలి. మీరు నిజంగా నన్ను ప్రేమిస్తే మా ఇంటికి వచ్చి తెలియజెయ్యండి. నేను ఇష్టం లేకున్నా వచ్చి మీ లెటర్ భద్రంగా తీసుకెళ్లండి.

ఇట్లు
మీ కేమవుతానో తెలియని,
వసంత!

• • • • • • • • •

"అన్నయ్యా! వసంత వదిన ఇప్పుడే వచ్చి అమ్మతో మాట్లాడి వెళ్ళింది...." చెప్పాడు తమ్ముడు. అనిల్ కుమార్‌కు మరేం వినిపించడం లేదు. హేంగరుకున్న షర్టు తగిలించుకొని ఒక్క ఉదుటున రోడ్డుమీద పడ్డాడు, తన ప్రక్కనే వసంతను వూహించుకుంటూ ✹

***(ఆంధ్రప్రభ వీక్లీ, తేది 21-4-82)***